# మర్యాదలు

శ్రీమతి సువేణి మతుకుమల్

మనిషిఅయి పుట్టాక మర్యాద అనేది తెలిసికొని ఉండాలి. అందులో స్త్రీలకు చెప్పనే అక్కర్లేదు. అసలు స్త్రీ అనే శబ్దము వినగానే మర్యాదలకు పుట్టిల్లు అనే భావన కలగాలి. ఎందుకంటే స్త్రీని గృహలక్ష్మి అన్నారు. గృహము యొక్క మంచి చెడ్డలు, అందచందములు ఆ ఇల్లాలిమీదనే ఆధారపడి ఉంటాయి. ఒక ఇల్లు కళకళ్లాడుతున్నదంటే ఆ ఇంటి ఇల్లాలు కళకళ్లాడుతూంటుందని వేరే చెప్పనక్కర్లేదు. ఇంకా చెప్పాలంటే మగవాడికి సంఘంలో స్థానం కల్పించేది స్త్రీ అనాలి. కనుక స్త్రీ ఎంత తెలివి అయినదిగా, ఎంత మంచిదిగా ఉండాలో చెప్పుట మనవసరము. ఇంటికొచ్చిన వారిని సత్కరించటము చాలవరకు స్త్రీ మీదనే ఆధారపడి ఉంటుందనాలి.

ఇంటికొచ్చిన అతిథుల మనస్సు నొచ్చుకోకుండా తగిన విధంగా వారిని సత్కరించట మెంత అవసరమో అంత గొప్ప విషయముకూడ. "ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటికామాటలాడి" అన్నట్లు ఎప్పుడెవ్వరితో ఎలా నడుచుకోవాలో తెలిసికోవటం ముఖ్యమైనది. 'ఎవ్వరేమనుకొంటె నాకేం? నా స్వభావమిది. నాకు మారటం చేతకాదు' అనుకోవటం తెలివి తక్కువను పదర్శించటమేకాకుండా వాళ్ల అహంభావాన్నికూడ బయలుపరుస్తుంది. కొంతమందికిది చాల తేలికవిషయంలాగ కనబడుతుంది. 'ఆమాత్రం మర్యాద చేయటంరాదా?' అంటారు. నిజానికి చాల మందికి చేతకాదనాలి చేతకాక పోవటమేకాకుండా అశ్రద్ధకూడ. కారణం దాని ఔన్నత్యము తెలిసికోలేకపోవటమే.

స్త్రీకి ఔన్నత్యము కలిగించేవాటిలో ఈ మర్యాద ఒకటనాలి - కాదు ముఖ్యమైనది. ఎంత చదువున్నా, ఎంత డబ్బున్నా ఈ మర్యాదనేది లేకపోతే ఆ మనిషికి నిజమైన విలువ ఉండదు. కాని ఈ కాలం వాళ్లకి మర్యాదలు తెలియవనాలి. వాటి ఔన్నత్యం అంతకంటె తెలియదు. తెలిసికోవాలని ఉండదో, తెలుసుకోవటమునేది చిన్నతనమనేభావనో! ఏమైతేనేమి చదువుకొని, ఉచ్ఛస్థితిలో ఉన్నవారికి మర్యాదలు ఎక్కువగా తెలుస్తాయనుకోవటం చివరికి భ్రమక్రింద మారుతోంది.

ముఖ్యంగా పెద్ద పెద్ద ఆఫీసర్ల భార్యలను చూస్తూంటే చాల ఆశ్చర్యంగా ఉంటుంది. మరి వాళ్ల ఉద్దేశమేమిటో తెలియదుగాని వాళ్లు తమకన్న శాస్త

తక్కువ అయినవాళ్లు అయితే చాలు తమ బంధువులను, స్నేహితులనుకూడ చాల అమర్యాదగా చూస్తారు. బహుశ ఎదుటివారికి మర్యాద ఇవ్వటమంటే తాము లోకువ అవటమనుకొంటారేమో! ఇదంతా ఏదో శాస్త్ర చదివినవాళ్లకి మరీ ఎక్కువగా ఉంటున్నది. నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకోగానే తమంతవాళ్లు లేరని, ఎదుటివాళ్లందరు ఎందుకు పనికి రారనే భావన కల్గుతోంది, అందువలననే వాళ్లు ఎదుటివాళ్లను ఎలా గౌరవించాలో తెలియక తికమకలుపడి దానికి దూరంగా ఉంటున్నారు.

పూర్వం ఎంత విద్యావంతులైనా, ఎంత ధనవంతులైనా ఎదుటివారి స్థితిగతులు విచారించగలశక్తి, వారి ఔన్నత్యము గుర్తింపగలశక్తి కలిగిఉండేవారు. శ్రీకృష్ణదేవరాయలంతటివాడు పెద్దన్న గారికి స్వయంగా గండపెండెరముతొడిగి గౌరవించాడంటే ఆయనకానాడీలోకువ అవుతామనే భయము లేదనిపిస్తుంది. బహుశ! ఆతనిలోని ఔన్నత్యమే ఆతనికాభావము కలగనీయలేదేమో! ఇంతకీ నేచెప్పేది ఎంత గొప్పవారైనా ఎదుటివారిని గుర్తించి తగినట్లు సత్కరించటములోనే నిజమైన గొప్పతనము కనిపిస్తుందని.

పూర్వము ఈమర్యాదల కెక్కువ ప్రాముఖ్యత ఇచ్చినట్లు మన పురాణ గాధలవలన తెలుస్తోంది. మరి వాళ్లందరు ఈ మర్యాదల ప్రాశస్త్యము తెలిసినవారేనా? ఏమో అందరు దీన్ని గురించి ఆలోచించి దాని విలువను తెలుసుకొని ఉంటారా! ఏమైతేనేమి ఆలోచించగల్గిన వాళ్లు, లేనివాళ్లుంటారనే మనవాళ్లు కొన్ని forms లాగ చేసిపారేశారు. అందువలన వాటివిలువ తెలిసినా తెలియకపోయినా గుడ్డిగా అనుసరించేవారు. ఆ పద్ధతే చక్కగాఉంది. కాని మన దురదృష్టవశమో ఏమో పాశ్చాత్యులు రావటం వారి ఆచారములు మనకి అంటించటము, అవి సరిగా మనకి అతుక్కోకపోవటమేకాకుండా, మన అలవాట్లన్ని అణిగిపోవటం జరగటంతో మనమీఅధ్వాన్నపుస్థితికొచ్చాము. సరే అయిపోయిన దానికి విచారించి ఏంచేస్తాము! ఇప్పుడైనా శాస్త్ర కనువిప్పామంటే మన సంస్కృతి గ్రహించవచ్చు. మన పూర్వులు కట్టినగోడలు కట్టినట్లుగా లేవిప్పుడు. అందుకు మనమెవ్వరిని ఏమి అనలేము. కాలచక్రం గిర్రున తిరుగుతున్నప్పుడు ఎన్నో మార్పులు సహజంగా జరుగుతూంటాయి. తురుష్కులరాకతో మన పూర్వ సాంప్రదాయము అనేక మార్పులు పొందింది. సరే అక్కడినుండి ఐరోపీయులరాకతో పూర్తిగా మారిపోయే స్థితికొచ్చింది. కాదని ఆపటం ఎవ్వరి శక్యముకాదు. కాని ఆ మార్పులను మన

సాంప్రదాయాలలో సరిచేసుకొని మన సాంప్రదాయమునకు మెరుగులు దిద్దుకోవటముత్తమము.

ఇంతకీ ఇదంతా మర్యాదలు మట్టిపాలు కాకుండా చూడాలని. పూర్వపువాటిని పట్టుకొని వ్రేలాడనూలేము, పాశ్చాత్యులవి పూర్తిగా అనుకరించనూలేము కనుక ఏదీలేకుండా ఉభయభ్రష్టుత్వము అయ్యేదానికన్నా మన ఆచారాలు, వాళ్ల ఆచారాలు సమన్వయముచేసుకొని ప్రవర్తించటము మంచిది. వీలుంటే ఈ సారి ఈ మర్యాదల గురించి బాగా విశదీకరించుకొందాము.




"సౌత్ ఇండియా ఆఫీసు :5/149, బ్రాడ్వే, మద్రాసు 1."